క్లుప్తంగా

డీఎస్సీ శిక్షణకు ఎంపిక పరీక్ష



ఎంపిక పరీక్షను పర్యవేక్షిస్తున్న అధికారులు

సీతంపేట: స్థానిక వైటీసీలో గురువారం డీఎస్సీ కోచింగ్‌కు ఎంపిక పరీక్ష జరిగింది. మొత్తం 422 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 380 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, ఐటీడీఏ ఉపవిద్యాశాఖాధికారి పి.నారాయుడు, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, హెచ్ఎం సూర్యనారాయణ పర్యవేక్షించారు.

ముమ్మరంగా వరినాట్లు



అర్ధలి సమీపంలో ఉడుపులో నిమగ్నమైన వ్యవసాయ కూలీలు

పాలకొండ రూరల్: మండల వ్యాప్తంగా వరి నాట్లు చివరిదశకు చేరుకున్నాయి. సాగునీటి వనరులు పూర్తిస్థాయిలో అనుకూలించపోయినా వరుణడి కరుణ, ప్రత్యామ్నాయ పద్ధతులపై ఆధారపడి మండల పరిధిలో లుంబూరు, ఓని, గుడివాడ, అర్ధలి, రాజుపేట, భాసూరు, కోటిపల్లి తోపాటు మరికొన్ని గ్రామాల్లో గురువారం ముమ్మరంగా ఉడుపులు చేపట్టారు. అధికారుల సూచనలతో ఆగస్టు చివరి వారం వరకు నాట్లు వేయన్నుట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు పొలాల్లో నీరు నిలవడంతో పంటను దక్కించుకునేందుకు వీలైనంత త్వరగా నీటిని బయటకు తరలించి, వ్యవసాయాధికారుల సలహాల మేరకు ఎరువులు వాడాలని వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి సూచించారు.

పగలు ఎండ..
సాయంత్రం చిరుజల్లులు



ఎండ తీవ్రతకు వెలవెలబోయిన పాలకొండ-విశాఖ రహదరి

పాలకొండ రూరల్: గతకొద్ది రోజులుగా పట్టణ, మండల వ్యాప్తంగా విచిత్ర వాతవరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు వేసవిని తలపిస్తుండగా.. సాయంత్రానికి వాతావరణం చల్లబడి చిరుజల్లులు కురుస్తున్నాయి. ఉదయం 10 గంటల నుంచి అధిక ఉష్ణోగ్రతతో పాటు ఉక్కపోత కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఈ ప్రభావం చిరువ్యాపారులపై పడుతోంది. సాయంత్రం ఆకాశంలో మబ్బులు వేయడంతో భారీ వర్షం కురుస్తుందని అంతా భావించినా భానుడు చిరుజల్లులతో సరిపెడుతున్నాడు. విచిత్ర వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వరుణడి కరుణ కోసం రైతులతో పాటు పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. గురువారం ఎండ తీవ్రతకు స్థానిక ప్రధాన రహదారి వెలవెలబోయింది.

పదో తరగతి విద్యార్థులకు బేస్‌లైన్ టెస్ట్



బేస్‌లైన్ టెస్టును పర్యవేక్షిస్తున్న ఎంఈఓ

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గురువారం బేస్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష నిర్వహించారు. మండలంలోని రేగులపాడు కేజీబీవీలో నిర్వహించిన బేస్‌లైన్ టెస్టును ఎంఈఓ ఆర్.ఆనందరావు పర్యవేక్షించారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

- 50 శాతం రాయితీపై విత్తనాలు
- పందిరి, మల్చింగ్ విధానంలో సాగుకు మరింత తోడ్పాటు
- కాయగూరల సాగుకు ఇదే అదును



కాయగూర రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారులు

పాలకొండ రూరల్: జిల్లాలో లక్షా 20వేల ఎకరాలలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నట్లు ఉద్యానశాఖ గణాంకాలు చెపుతున్నాయి. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ఉద్యానశాఖ మేలైన విత్తనాలను 50 శాతం రాయితీపై అందజేస్తోంది. కూరగాయల రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన రశీదుతో పాటు సాగు చేస్తున్న భూమి వివరాలతో కూడిన దరఖాస్తులను గ్రామ ఉద్యానశాఖ అసిస్టెంట్లు ద్వారా జిల్లా కార్యాలయానికి పంపితే డీహెచ్ పరిశీలించి విత్తన రాయితీ సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. తీగజాతి కూరగాయలైన బీర పంటలు, టమాటా పంటను పందిరి విధానంతో (కట్టెలు, దారాలతో) సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.7,500, మల్చింగ్ పద్ధతి (ప్లాస్టిక్ కవర్లు భూమిపై పరచి సాగు) ద్వారా సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.6,400, తీగజాతి కూరగాయల సాగుకు సిమ్మెంట్ పోల్స్‌తో పందిర్లు వేస్తే రూ.లక్ష రాయితీ అందిస్తోంది. ఔత్సాహికులు రైతు సేవా కేంద్రాలలో పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్సు పత్రాలు, రైతు పొలంలో తీసుకున్న ఫొటోను అందించాలి. కూరగాయల నారు బిల్లు, ప్లాస్టిక్ కవర్లకు కొనుగోలుకు సంబంధించిన బిల్లు అధికారులకు అందిస్తే రాయితీ మొత్తం జమ చేస్తారు.

సాగులో సస్యరక్షణ కీలకం

ఉద్యాన పంటల సాగులో సస్యరక్షణ కీలకం. విత్తనాలు విత్తే ముందు రసాయన ద్రావణంతో శుద్ధి చేయాలి. కిలో విత్తనానికి మూడు గ్రాముల థైరమ్. 5 గ్రాముల ఇమిడాక్రోఫిన్ మందును ఒకదాని తరువాత మరొకటి కలిపి విత్తన శుద్ధి చేస్తే కూరగాయ మొక్కలకు తెగుళ్లను తట్టుకునే శక్తి వస్తుంది. విత్తే ముందు ఎకరానికి ఆరు టన్నుల పశువుల ఎరువు, 35 కిలోల భాస్వరం, 18 కిలోల పొటాష్ మిశ్రమాన్ని విత్తన గుంటల్లో వేయాలి. విత్తిన 25-30 రోజుల్లో లేదా పిందె దశలో సుమారు 30 కిలోల నత్రజనిని రెండు సమపాళ్లుగా చేసి మొక్క అందించాలి. కూరగాయల సాగు చేయాలని నిశ్చయించుకుంటే వేసవిలోనే దుక్కి దున్ని ఉంచుకుంటే మంచి ఫలితం ఉంటుంది. కలుపు మొక్కలు లేకుండా ఉద్యాన రైతులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి.

జాగ్రత్తలు పాటిస్తే లాభాలు

తీగజాతి కూరగాయల సాగు సులభతరం. ఖర్చు కూడా తక్కువే. ఈ తరహా పంటల సాగుకు వెదురు కర్రలతో పందిళ్లు వేసి వాటిపైకి ఎక్కేందుకు తాళ్లను కట్టాలి. పందిరి వేస్తే కాసిన కాయలు కిందకు వేలాడతాయి. ఇలా వేలాడిన వాటిని తెంపడం సులభం. ఇలా పండించిన కూరగాయలు నాణ్యతగా ఉండడంతో పాటు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం సరైన సమయం కావడంతో తీగజాతి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి. అవసరమైన రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు రాయితీపై అందించనున్నాం. సాగులో మెలకువలు, సస్యరక్షణపై సూచనలు అందిస్తాం.

– తమ్మినేని అమరేశ్వరి, ఉద్యావన శాఖాధికారిని, పాలకొండ

అందని 24 గంటల వైద్య సేవలు



కొమరాడ పీహెచ్‌సీ

కొమరాడ: పీహెచ్‌సీల్లో 24 గంటల వైద్య సేవలు గతంలా అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో వైద్య సేవలు రోగులకు అందించేది. ఇప్పటి ప్రభుత్వం దీన్ని పట్టించుకోకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. మండలంలో కొమరాడ, కూనేరు రామభద్రపురం, మాదలింగి గ్రామాల్లో మూడు పీహెచ్‌సీలు ఉన్నాయి. ఇక్కడ గతంలా ప్రస్తుతం వైద్య సేవలు అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యులు సమావేశాలంటూ వెళ్లిపోతుండడంతో ప్రస్తుతం జ్వరాల సీజన్‌లో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. ఇక్కడ వైద్యులు అందుబాటులో లేకపోతుండడంతో క్షేత్ర స్థాయి సిబ్బంది ఇక్కడకు వచ్చే వారికి తూతూ మంత్రంగా వైద్యం అందించి పరిస్థితి విషమిస్తే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారని రోగులు వాపోతున్నారు. పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్య సేవలు అందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గండి పూడ్చివేత



అధికారులు పూడ్చిన గండి ప్రదేశం



ప్రధాన రహదారి పరిధిలో పడిన గండి

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి కురిసిన అతి భారీ వర్షానికి పార్వతీపురం – శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలోని తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ సమీపంలో రహదారి మధ్యలో పెద్ద గండి పడింది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు చేసే వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్న ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆర్అండ్‌బీ శాఖ, రెవెన్యూ శాఖ, పోలీసులు గండి ప్రదేశాన్ని సందర్శించి యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పోలీసులు అవసరమైన చర్యలను చేపట్టారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా గండిని పూడ్చినట్లు ఆర్అండ్‌బీ జేఈ పి.ప్రమీల తెలిపారు.

వీరఘట్టంలో కుండపోత



వట్టిగెడ్డలో పెరిగిన నీటి ప్రవాహం



భామిని వద్ద పత్తి పంటలో నిలిచిన వర్షపునీరు

వీరఘట్టం: మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో పాటు కుండపోత వర్షం కురిసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వచ్చి చేరడంతో స్థానిక ఒట్టిగెడ్డలో నీటి ప్రవాహవ పెరిగింది. ఈ వర్షం ఖరీఫ్ పంటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీట మునిగిన పొలాలు

భామిని: మండలంలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు, పంటపొలాల్లో నీరు చేరింది. పత్తి, కూరగాయలు, మొక్కజొన్న, తదితర పంటలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో లాభం కంటే నష్టమే అధికమని రైతులు వాపోతున్నారు.

28న వాహనాల వేలం

పాలకొండ: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహిస్తామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే ఆసక్తి ఉన్న వారు ప్రథమ దరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి స్టేషన్ ఆరవణలో వేలం నిర్వహిస్తామని తెలిపారు. వేలంలో వాహనాలు దక్కించుకున్నవారు అదే రోజు చలనా రూపంలో మొత్తం నగదు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వాహన తనిఖీలు



సీతంపేట రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయిస్తామని ఏఎస్సై ధర్మారావు స్పష్టం చేశారు. గురువారం రాత్రి పాలకొండ-సీతంపేట, విశాఖ, పార్వతీపురం రహదారుల్లో బ్రీత్‌ఎనలైజర్ల సహాయంతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించి, మద్యం సేవించి, వాహన ధ్రువపత్రాలు, లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురిపై అపరాధ రుసుం విధించారు. మరి కొందరిపై కేసులు నమోదు చేశారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి



మాట్లాడుతున్న గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రతినిధి నాగరాజు

సీతంపేట: అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రతినిధి నాగరాజు అన్నారు. మండలంలోని గొయిది గ్రామాన్ని గురువారం సందర్శించారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. పంచాయతీ పరిధిలో ఏయే పథకాలు అమలు చేశారు, ఇంకా చేయాల్సిన పనులు గూర్చి గ్రామస్తులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న కుక్కలు



పట్టణంలో గటాలదెప్పివీధి వద్ద కుక్కల గుంపు

పాలకొండ రూరల్: ఎక్కడ చూసినా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. సీజన్ ప్రభావంతో గ్రామ సింహాల గుంపులు ప్రధాన రహదారుల్లో, వీధి కూడళ్ల వద్ద తిరుగుతూ పాదచారులు, చిన్నారులు, వాహన చోదకులపై దాడులు చేస్తున్నాయి. రోజురోజుకు వీటి సంఖ్య పెరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కలను బెడద నుంచి రక్షణ కల్పించాలని, వాటిని అదుపు చేసి దూరప్రాంతాల్లో విడిచిపెట్టాలని కోరుతున్నారు.

మోతాదు మించితే అనర్థమే..



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సౌజన్య

వీరఘట్టం: అధిక మోతాదులో ఎరువులు వినియోగిస్తే పంటకు అనర్థం తప్పదని మండల వ్యవసాయశాఖ అధికారి జే సౌజన్య సూచించారు. మండలంలోని చలివేంద్రి గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.

ఇందులో భాగంగా గాప్ (గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్), ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. సాధారణ ఎరువుల కంటే నానో యూరియా, నానో డీఏపీ వినియోగం వల్ల పంటకు ఎంతో మేలని సూచించారు. అలాగే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగ కుటుంబానికి చేయూత



దివ్యాంగుడు నెల్లి శంకర్‌కు దుకాణాన్ని అప్పగిస్తున్న ట్రస్టు సభ్యులు

భామిని: మండలంలోని సతివాడకు చెందిన దివ్యాంగుడు నెల్లి శంకర్ కుటుంబానికి కొత్తూరుకు చెందిన భగత్‌సింగ్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. సతివాడ గ్రామంలో చిన్న దుకాణం ఏర్పాటు చేసి శంకర్ కుటుంబానికి అప్పగించారు. భవన నిర్మాణ కార్మికుడైన శంకరరావు ఈ ఏడాది ఫిబ్రవరిలో సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణ భారంగా మారింది. ఆ కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను తెలుసుకుని భగత్‌సింగ్ ట్రస్ట్ సభ్యులు శంకర్ కుటుంబానికి జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో గ్రామంలో చిన్న దుకాణం ఏర్పాటు చేశారు.

నిమ్మలపాడు పంట పొలాల్లో ఏనుగులు



నిమ్మలపాడు పంట పొలంలో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, నిమ్మలపాడు వద్ద ఉన్న గుమ్మిడిగెడ్డ వాగులో ఏనుగులు సంచరిస్తున్నాయి. గురువారం ఉదయం అరటి తోటలో ఉన్న ఏనుగులు గుమ్మిడిగెడ్డ వాగు దాటుకుంటూ పాత నిమ్మలపాడులో తిష్టవేసాయి. అరటి పంటను ధ్వంసం చేయడంతో పాటు గ్రామంలోకి వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి



భద్రగిరి సీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న సెక్యూరిటీ గార్డులు, పారిశుద్ధ్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: పెండింగ్‌లో ఉన్న తమ జీతాలు చెల్లించాలని మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలోని విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్యం, సెక్యూరిటీ సిబ్బంది డిమాండ్ చేశారు. సీహెచ్‌సీ ఎదుట గురువారం వారంతా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు వెంకటరావు, శ్రీరాములు, గౌరమ్మ, బారికి తదితరులు మాట్లాడుతూ గత ఐదు నెలలుగా తమ జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉందన్నారు. గత మూడేళ్లుగా పీఎఫ్ బకాయిలు మొత్తం చెల్లించాలని, ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి ఆప్కాస్‌లో చేర్చాలని, జీఓ 549, 43 ప్రకారం వర్కర్లకు, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే సెప్టెంబర్ 5 నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

అధ్వానంగా రహదారి



అధ్వానంగా ఉన్న రోడ్డును చూపుతున్న డెప్పిగూడ గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చెముడుగూడ పంచాయతీ డెప్పిగూడ నుంచి రెల్లిగూడ గ్రామాల మధ్య గల రహదారి బురదమయమై అధ్వానంగా ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు డెప్పిగూడ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డెప్పిగూడ నుంచి రెల్లిగూడ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు మధ్య కేవలం కిలోమీటరు రహదారి ఈ వర్షాలకు పూర్తిగా బురదమయం అయిందని, కాలినడకన సైతం రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోందని, తప్పనిసరి పరిస్థితుల్లో చుట్టూ పది కిలోమీటర్లు తిరిగాల్సి వస్తోందని, ఈ పరిస్థితుల దృష్ట్యా అధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మిస్తే తమతో పాటు సమీప గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగుతాయని గిరిజనులు కోరుతున్నారు.

స్కిల్ హబ్ సెంటర్‌ను పరిశీలించిన పీడీ



స్కిల్ హబ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న పీడీ రాణి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ సెంటర్‌ను జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.వి.రాణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్కిల్ హబ్ సక్రమంగా నిర్వహిస్తున్నదీ లేనిది, శిక్షణ పొందేందుకు నిరుద్యోగులు ఆశక్తి చూపుతున్నదీ లేనిది తదితర అంశాలపై ఆరా తీసారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్కిల్ హబ్ వద్ద త్వరలో కిశోర బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆమె వెంట భద్రగిరి సీడీపీఓ సీహెచ్ సుశీలదేవి, సూపర్‌వైజర్లు ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే..



గుమడ వద్ద ప్రధాన రహదారిపై గోతులో నిలిచిన వర్షపు నీరు

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వరకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా గోతులమయం కావడంతో వర్షం పడితే ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతుంది. దీంతో వాహనదారులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రధాన రహదారి అంతా వర్షపు నీరుతో నిండిపోతుంది. ఈ మార్గంలో వాహనాలపై ప్రయాణం భయాందోళనలు కలిగిస్తోంది. ఈ రహదారిపై స్థానికులు పలుమార్లు ఆందోళనలు చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు పోలమాంబ ఆలయంలో కుంకుమపూజలు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ గురువారం తెలిపారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 9గంటలకు వేదపండితులతో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ జరిపించనున్నట్లు ఆయన పేర్కొంటూ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నేడు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ: మండలంలోని నవగాం 11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ టీజీ మూర్తి గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని పొట్లి, జంపరకోట, ఎం.సింగుపురం, మల్లివీడు, బడ్డుమహసింగి, అవలంగి గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. మరమ్మతు పనులు చేపడుతున్నందున సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీతంపేట: మండలంలోని కుశిమి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏఈ జి.నీలిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామన్నారు.

గరుగుబిల్లి: పార్వతీపురం మండలం అడ్డాపుశీల గ్రామ సమీపంలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులతో పాటు విద్యుత్‌లైన్లకు ఆనుకొని వున్న చెట్టు కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో మండలంలోని ఉల్లిబద్ర, కెఆర్ఎన్ వలస, కొంకడివరం, సీతారాంపురం తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ బి.శంకరరావు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్న తరుణంలో ఆయా గ్రామాల వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

కొమరాడ: మండలంలోనం కొమరాడ, కొట్టు, గంగరేగువలస గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏఈ జి.వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు దీన్ని గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

పంచాయతీల్లో గ్రామసభలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలో గల 23 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ అప్పారావు గురువారం తెలిపారు. ఈ మేరకు గ్రామ సభ నిర్వహించేందుకు ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను, వాటి వివరాలను పంచాయతీ కార్యాలయాల ఆవరణలో ప్లెక్సీల రూపంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే సభలో ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25కు సంబంధించి ప్రతిపాదించిన పనులు గుర్తించడం జరుగుతుందన్నారు.

– **పాలకొండ రూరల్:** మండలంలోని 32 పంచాయతీల్లో నేడు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి గురువారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఈ కార్యక్రమయం పంచాయతీ కేంద్రాల్లో చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధుల, అధికారుల సమక్షంలో చేపట్టనున్న ఈ సభల ద్వారా 2024-25 ఏడాదిలో జాతీయ ఉపాధిహామీ ద్వారా పంచాయతీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామన్నారు.

'పీఎం జన్‌మన్' సదస్సులు

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని అన్ని మండలాల్లో, పంచాయతీలో శుక్రవారం 'పీఎం జన్‌మన్' అవగాహన సదస్సులు నిర్వహించాలని ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ వి.వి.రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 రకాల పథకాల అమలు లక్ష్యాలు, ఉద్దేశాలు, గిరిజనులకు కలిగే లబ్ధిని వివరించాలన్నారు. జన్‌మన్ వెబ్‌సైట్‌లో అవగాహన సదస్సుల నిర్వహణ ఫోటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.